సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 20 । ఆగస్టు । 2024



పారదోలాల్సిన సమయమిదే..

పలు రకాల విష జ్వరాలకు కారణమవుతున్న దోమల నిర్మూలనకు చర్యలు చేపట్టాలని వైద్యులు సూచిస్తున్నారు.

8లో



వేధిస్తున్న సిబ్బంది కొరత

ములకలపల్లిలోని మంగపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది కొరతతో పాటు పలు సమస్యలు వేధిస్తున్నాయి.

8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 33° / 26°

జిల్లాలో మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

మళ్లీ పోటీకి నై !



అప్పు చేసి.. భవనం నిర్మించి..



టేకులపల్లి: ఇది టేకులపల్లి మండలం తావుర్యా తండా పంచాయతీ కార్యాలయం. గత ప్రభుత్వ హయాంలో గిరిజన సంక్షేమ శాఖ నుంచి రూ.20 లక్షల వ్యయంతో భవనాన్ని మంజూరు చేశారు. దీంతో నాటి సర్పంచ్ తేజావత్ రమేష్ రూ.20 లక్షలు అప్పుచేసి మరీ పంచాయతీ కార్యాలయాన్ని నిర్మించారు. పనులు పూర్తయి ఎనిమిది నెలలు గడిచినా నేటికీ ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదు. తన పరిస్థితి 'భవనాన్ని చూసుకుని మురవ.. చెప్పుకుని ఏడ్వ' అన్నట్టుగా ఉందని మాజీ సర్పంచ్ రమేష్ ఆవేదన చెందుతున్నారు.

సర్పంచ్ పదవికి మాకొద్దంటున్న తాజా మాజీలు

- భారీగా పేరుకుపోయిన పెండింగ్ బిల్లులు
- ఐదేళ్లలో ఆర్థికంగా చితికిపోయామంటూ ఆవేదన
- ఈసారి బరిలో నిలిచేందుకు విముఖత

చుంచుపల్లి: త్వరలో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. సాధారణంగా పంచాయతీ ఎన్నికలు అంటే గ్రామాల్లో సందడి మామూలుగా ఉండదు. వార్డు సభ్యుడిగా, సర్పంచ్‌గా పోటీకి పలువురు ఉవ్విళ్లూరుతుంటారు. ఓ నాయకుడు రాజకీయంగా ఎదగాలంటే ఈ ఎన్నికలే కీలకం. అయితే ఈసారి పరిస్థితులు భిన్నంగా కనిపిస్తున్నాయి. పంచాయతీ ఎన్నికల్లో పోటీకి తాజా మాజీ సర్పంచ్‌లతో పాటు పలువురు వెనుకంజ వేస్తున్నారు. గత ఐదేళ్ల కాలంలో గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు చేసిన సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు నేటికీ బిల్లులు అందలేదు. తమ హయాంలో ఆర్థిక ఇబ్బందులు తప్ప సాధించిందేమీ లేదనే అసంతృప్తితో వారు ఉన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నాలుగు విడతల్లో చేపట్టిన పల్లె ప్రగతి కార్యక్రమాల్లో సర్పంచ్‌లు, వార్డు మెంబర్లే ముందుగా పెట్టుబడి పెట్టి అభివృద్ధి పనులు పూర్తి చేశారు. ప్రభుత్వం టార్గెట్‌లు విధించడంతో పలువురు అప్పులు తెచ్చి మరీ పనులు చేశారు. వాటికి సకాలంలో బిల్లులు రాక నానా తంటాలు పడ్డారు. గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘం నుంచి వచ్చే అరకొర నిధులు సిబ్బంది వేతనాలు, ట్రాక్టర్ల నిర్వహణ, ఇతర ఖర్చులకే సరిపోయేవి. ఇక అభివృద్ధి పనుల కోసం వడ్డీలకు తేగా బిల్లులు రాక, వడ్డీలు పెరిగి ఆర్థికంగా చితికిపోయారు. ఈ తరుణంలో చేతిలో చిల్లి గవ్వ లేకుండా మళ్లీ ఎన్నికల్లో పోటీ చేయడమంటే పెను సవాలేనని పలువురు అంటున్నారు. రూ.లక్షలు ఖర్చు చేసి విజయం సాధించినా ఉద్ధరించేది ఏమీ ఉండదనే భావనతో ఉన్నారు.

రూ.లక్షల్లో పెండింగ్ బిల్లులు..

జిల్లాలో 479 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఆయా సర్పంచ్‌ల పదవీ కాలం ఈ ఏడాది ఫిబ్రవరి 1తో ముగిసింది. వారి హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి ఒక్కో పంచాయతీ పరిధిలో రూ.లక్షల కొద్దీ బిల్లులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులంటూ సర్పంచ్‌లను అధికారులు పరుగులు పెట్టించారు. వైకుంఠధామాలు, తడి, పొడి చెత్త సేకరణకు డంపింగ్ యార్డులు, క్రీడా ప్రాంగణాలు, పల్లె ప్రకృతి వనాలు, హరిత నర్సరీల ఏర్పాటు, ట్రాక్టర్ల కొనుగోలు వంటి పనులు చేపట్టారు. మన ఊరు–మన బడి, రైతు వేదికలు, ట్రాక్టర్ల నిర్వహణ, కార్మికుల వేతనాల చెల్లింపులు ఇలా అనేక కార్యక్రమాలకు సర్పంచ్‌లనే బాధ్యులు చేశారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలతో పాటు ఇతర పనులు చేయించారు. ఇలా పంచాయతీ పరిధిని బట్టి రూ.5 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు పెండింగ్ బిల్లులు సర్పంచ్‌లకు రావాల్సి ఉంది. జిల్లాలో దాదాపు రూ.60 కోట్ల మేర బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని తాజా మాజీ సర్పంచ్‌లు చెబుతున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఆ బిల్లులు వస్తాయో రావోననే ఆందోళనలో ఉన్నారు. గత ఆరు నెలలుగా పంచాయతీలకు ఎలాంటి నిధులు విడుదల కాకపోవడంతో తామే ఖర్చు పెట్టాల్సి వస్తోందని కార్యదర్శులు వాపోతున్నారు.

నానా ఇబ్బందులు పడ్డాం

సర్పంచ్‌గా గత ఐదేళ్లలో నానా ఇబ్బందులు ఎదుర్కొన్నా. గ్రామాభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో భారమంతా సర్పంచ్‌ల పైనే పడింది. పల్లె ప్రగతి పేరుతో టార్గెట్లు పెట్టి మరీ పనులు చేయించారు. అవి పూర్తయిన తర్వాత సర్పంచ్‌లను పట్టించుకున్న పాపాన పోలేదు. నాకు రూ.20 లక్షల వరకు పెండింగ్ బిల్లులు రావాలి. ఈ తరుణంలో మళ్లీ డబ్బు ఖర్చు పెట్టి సర్పంచ్‌గా పోటీ చేయాలనే ఆలోచన, ఆసక్తి లేవు.

– బానోత్ గోవింద్, మాజీ సర్పంచ్, విద్యానగర్

ఆ ఆలోచనే లేదు

కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీని అభివృద్ధి చేయాలనే తపనతో మొదటిసారి సర్పంచ్‌గా పోటీ చేసి గెలిచాను. ఐదేళ్ల కాలంలో పేరుకు మాత్రమే సర్పంచ్‌గా మిగిలాం. సకాలంలో నిధులు విడుదల కాక, చేసిన పనులకు బిల్లులు రాక ఇబ్బందులు పడాల్సి వచ్చింది. మా పదవీ కాలం ముగిసి ఆరు నెలలు అవుతున్నా రూ.6 లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉంది. సర్పంచ్‌గా ఇబ్బందులను ప్రత్యక్షంగా చూశాం. మళ్లీ బరిలో నిలవాలనే ఆలోచన లేదు.

– జ్ఞానమూర్తి సరిత, మాజీ సర్పంచ్, రామాంజనేయకాలనీ

ఆదివాసీ కళాకృతులు అందరికీ చేరాలి



ఆదివాసీల కళాకృతుల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ తదితరులు

కలెక్టర్ జితేష్ వి పాటిల్

భద్రాచలం: ఆదివాసీ, గిరిజన కళాకృతులు ప్రపంచ నలుమూలలకూ చేరేలా చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన మ్యూజియాన్ని అహ్మదాబాద్‌కు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైనింగ్ ప్రొఫెసర్ సంకల్ప బృందంతో కలిసి సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆదివాసీల జీవనశైలి భిన్నమైనదని అన్నారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, మనుగడ సాధనకు వాడిన పనిముట్ల గురించి బృందం సభ్యులకు వివరించారు. అనంతరం మ్యూజియంలో పొందుపరిచిన కళాకృతులను పరిశీలించి నాయకపోడు, కోయతెగ కళాకారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. కళాకృతులు బాహ్య ప్రపంచానికి తెలిసేలా తయారు చేయాలని, అప్పుడే గుర్తింపు వస్తుందని అన్నారు. ప్రధానంగా భద్రాచలం ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతం అయినందున టూరిస్టులు, భక్తులను ఆకర్షించేలా తయారు చేయాలని సూచించారు. ఆదివాసీ కళాకారులను మెట్రో నగరాలకు పంపి మెరుగైన శిక్షణ ఇప్పిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డీడీ మణెమ్మ, ఏసీఎంఓ రమణయ్య, ఏటీడీఓ అశోక్‌కుమార్, ఆర్‌ఐ నరసింహారావు, మ్యూజియం ఇన్‌చార్జ్ వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

రామయ్యను దర్శించుకున్న కలెక్టర్..

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారిని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సోమవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలకగా, అంతరాలయంలో మూలమూర్తుల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ లక్ష్మీ తాయారు అమ్మవారి ఉపాలయంలో పండితులు వేదాశీర్వచనం చేసి ప్రసాదాలు, జ్ఞాపిక అందజేశారు. ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబు పాల్గొన్నారు.

అన్ని మండలాల్లో ప్రజావాణి..

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేసిన రైతు రుణమాఫీకి అర్హత ఉండి, మాఫీ కాని రైతులు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. ఇందుకోసం జిల్లాలోని 23 మండలాల్లో వ్యవసాయ అధికారులు మంగళవారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహిస్తారని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు రుణమాఫీ కానీ రైతులు వ్యవసాయ అధికారులను కలిసి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. జిల్లాలో అర్హత గల రైతులందరికీ రుణమాఫీ వర్తిస్తుందని, ఎవరూ ఆందోళన చెందొద్దని కోరారు.

కిన్నెరసానిని పరిశీలించిన కలెక్టర్

పాల్వంచరూరల్ : కిన్నెరసాని పర్యాటక ప్రాంతానికి కలెక్టర్ జితేష్ వి పాటిల్ అహ్మదాబాద్ నుంచి వచ్చిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైనింగ్ ప్రొఫెసర్ మను, సంకల్ప తదితరులతో కలిసి సోమవారం సందర్శించారు. జలాశయం మధ్యలో గల ఆనంద విహార్‌ను పరిశీలించారు. అనంతరం అద్దాలమేడ, కాటేజీలు, డీర్‌పార్కుతో పాటు పర్యావరణ కేంద్ర భవనంలోని జంతువుల బొమ్మలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కిన్నెరసానిలో ఎలాంటి అభివృద్ధి పనులు నిర్వహిస్తే పర్యాటకులను ఆకర్షించవచ్చో పరిశీలించి డిజైన్ చేయాలని బృందం సభ్యులకు సూచించారు.



పర్యావరణ కేంద్ర భవనం పరిశీలనకు వెళ్తున్న కలెక్టర్ తదితరులు

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లి ఆలయంలో చండీహోమం



స్వామివారిని ఊరేగింపుగా తీసుకొస్తున్న అర్చకులు, భక్తులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారి ఆలయంలో సోమవారం శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని వైభవంగా చండీహోమం నిర్వహించారు. ముందుగా మేళతాళాలు, వేదమంత్రాల నడుమ స్వామివారిని ఊరేగింపుగా యాగశాలకు తీసుకొచ్చారు. అక్కడ మండపారాధన, గణపతిపూజ అనంతరం శాస్త్రోక్తంగా హోమం జరిపించారు. పూజల్లో పాల్గొన్న 16 మంది భక్త దంపతులకు అర్చకులు అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు రవికుమార్ శర్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

బాలాజీ ఆలయంలో సుదర్శన హోమం



సుదర్శన హోమం చేస్తున్న అర్చకుడు

అన్నపురెడ్డిపల్లి : మండల కేంద్రంలో కొలువై ఉన్న శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో సోమవారం వైభవంగా సుదర్శన హోమం జరిపించారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచే స్వామి వారికి అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు గిరిధరాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు శాస్త్రోక్తంగా హోమం గావించగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. కాగా, రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఆదివాసీ భాష, సంస్కృతిని కాపాడుకోవాలి

ఐటీసీ పీఎస్‌పీడీ హెచ్‌ఆర్ హెడ్ శ్యామ్‌కిరణ్



మాట్లాడుతున్న శ్యామ్‌కిరణ్

బూర్గంపాడు: ప్రపంచ వ్యాప్తంగా అంతరిస్తున్న ఆదివాసీ భాష, సంస్కృతులను కాపాడుకోవాలని ఐటీసీ పీఎస్‌పీడీ మానవ వనరుల విభాగం హెడ్ శ్యామ్‌కిరణ్ అన్నారు. మండలంలోని కోయగూడెం రైతు వేదికలో సోమవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. భాష సాహిత్య రూపంలో ఉంటేనే మనుగడ ఉంటుందని, కోయ భాషను భావితరాలకు అందించేందుకు ఆదివాసీ ప్రముఖులు కృషి చేయాలని అన్నారు. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు భిన్నమైనవని, వాటిని సంరక్షించుకోవాలని కోరారు. అనంతరం 'ఇండిజినెస్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్' నిర్వాహకులు పాయం రాజేంద్రప్రసాద్, కోయత్తూరుబాట వ్యవస్థాపకుడు గంగాదేవి యాదయ్య కోయ భాష, సాహిత్యం ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు పాండు కమ్మేకర్, తెల్లం రమణయ్య, తెల్లం కృష్ణ, సత్యనారాయణ, పాయం వెంకటరత్నం, సకినం శ్రీనివాస్, కుంజా నాగలక్ష్మి, పూనెం ఇషాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెంలో రేపు భట్టి పర్యటన

ఎర్రుపాలెం: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఈనెల 21న బుధవారం ఎర్రుపాలెం మండలంలో పర్యటించనున్నారు. ఈసందర్భంగా మీనవోలు, ఎర్రుపాలెం, వెంకటాపురంలో పర్యటించనున్న ఆయన మీనవోలు – బనిగండ్లపాడు, ఎర్రుపాలెం – పెగళ్లపాడు, కొత్తపాలెం – గట్లగౌరారం, ఎర్రుపాలెం – జమలాపురం, వెంకటాపురం – బుచ్చిరెడ్డిపాలెం, బుచ్చిరెడ్డిపాలెం – వెంకటాపురం, నారాయణపురం – రాజుపాలెం, రాజుపాలెం – కొత్తపాలెం మధ్య బీటీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. కాగా, డిప్యూటీ సీఎం భట్టి పర్యటనలో కాంగ్రెస్ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో కోరారు.

సుందర్‌లాల్ ఇంట 'పండుగ'

ఎమ్మెల్యే హామీతో ఏడేళ్ల ఆందోళన విరమణ



ఎమ్మెల్యే కోరం కనకయ్యకు కృతజ్ఞతలు తెలుపుతున్న సుందర్‌లాల్

ఇల్లెందు: సింగరేణి నిర్వాసితుడు సుందర్‌లాల్ లోధ్, ఆయన కుమారుడు సంజయ్‌లోద్ ఏడేళ్లుగా సాగిస్తున్న వినూత్న ఆందోళనకు ఎమ్మెల్యే కోరం కనకయ్య హామీతో తెరపడింది. రాఖీ పౌర్ణమి రోజున తమ ఇంట నిజమైన పండుగ వాతావరణం ఏర్పడిందని ఈ సందర్భంగా సుందర్‌లాల్ కుటుంబసభ్యులు ఆనందోత్సాహాలతో ప్రకటించారు. తమ తాత, ముత్తాతల నుంచి సంక్రమించిన భూమిలో సింగరేణి సంస్థ ఓసీ ఏర్పాటు చేసిందని, తమకు పరిహారం చెల్లించలేదని, కనీసం పని కూడా కల్పించలేదని ఆరోపిస్తూ ఏడేళ్లుగా సుందర్‌లాల్ ఎడ్ల బండి చుట్టూ నిరసన బ్యానర్‌లు కట్టుకుని, తాను వేసుకునే వస్త్రాలపై కూడా నినాదాలు రాసుకుని తిరుగుతూ నిరసన వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో సుందర్‌లాల్ కుమారుడు సంజయ్ కూడా తనకు ఇక్కడ అన్యాయం జరిగిందంటూ నేపాల్‌కు వెళ్లిపోయాడు. అయితే ఎట్టకేలకు స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య స్పందించి సుందర్‌లాల్ కుటుంబానికి ఎంతో కొంత భూమి ఇప్పిస్తానని, సంజయ్‌ని కూడా నేపాల్ నుంచి తిరిగి రావాలని సూచించారు. దీంతో ఆ యువకుడు తిరిగి ఇంటికి చేరుకోగా, ఏడేళ్ల నిరసనను విరమించారు. ఇన్నాళ్లకు తమకు న్యాయం చేసిన ఎమ్మెల్యేకు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు.

బియ్యం నాణ్యతపై కేంద్ర బృందం ఆరా

ఖమ్మంరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో రేషన్ షాపులు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన అమలు తీరును ఢిల్లీ నుండి వచ్చిన కేంద్ర సాంకేతిక బృందం సభ్యులు సోమవారం తనిఖీ చేశారు. గూడురుపాడు, తనగంపాడు, కస్నాతండాల్లో రేషన్ బియ్యం నాణ్యతపై ఆరా తీసిన వారు ప్రతీనెలా నాణ్యమైనా బియ్యం ఇస్తున్నారా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యతను కూడా తనిఖీ చేశారు. ఈ బృందానికి రామచంద్రరావు, సునీత నేతృత్వం వహించగా, సివిల్ డీటీ తహసీల్దార్ విజయ్‌బాబు, ఎఫ్‌సీఐ గోదాం ఇన్‌చార్జ్ చత్రసింగ్ తదితరులు పాల్గొన్నారు.

అనురాగానికి ప్రతీక.. రాఖీ

– ఫొటోలు 9లో

అన్నా చెల్లి.. అక్కా తమ్ముళ్ల అనురాగానికి ప్రతీక రాఖీ. జిల్లా వ్యాప్తంగా సోమవారం రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. చిన్నా, పెద్ద తేడా లేకుండా సోదరులకు అక్కా చెల్లెళ్లు రాఖీలు కట్టి, స్వీట్లు తినిపించారు. వివిధ ప్రాంతాల నుంచి ఆడపడుచులు పుట్టింటికి రావడంతో పల్లెలు, పట్టణాలు కళకళలాడాయి. బస్సులు మహిళా ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. ముఖ్యంగా కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం తదితర బస్టాండ్లు మహిళలతో సందడిగా మారాయి.



జూలూరుపాడు మండలం కరివారిగూడెంలో తమ్ముళ్లకు రాఖీ కడుతున్న చిన్నారులు

వ్యవసాయ శాఖలో బదిలీలు

ఏడీఏలు, మినిస్ట్రీరియల్ ఉద్యోగులకు స్థానచలనం



ఖమ్మంవ్యవసాయం: వ్యవసాయ శాఖలో వివిధ కేటగిరీల అధికారులు, ఉద్యోగుల బదిలీలను సోమవారం చేపట్టారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి పర్యవేక్షణలో ఆన్‌లైన్ విధానంలో కౌన్సెలింగ్ నిర్వహించగా సహాయ వ్యవసాయ సంచాలకులు(ఏడీఏ), సూపరింటెండెంట్లు, సీనియర్ అసిస్టెంట్లకు స్థానచలనం కలిగింది. ఈనెల 2, 3వ తేదీల్లో ఏఈఓలు, ఏఓల బదిలీలు నిర్వహించగా, రుణమాఫీ ప్రక్రియ పూర్తికావడంతో మిగతా ఉద్యోగులకు బదిలీలపై దృష్టి సారించారు.

బదిలీ ఉద్యోగుల వివరాలు

ఉద్యోగి	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఏడీఏలు		
జి.సరిత	డీఏఓ ఆఫీస్	కూసుమంచి
శ్రీనివాసరెడ్డి	డీఏఓ ఆఫీస్	సత్తుపల్లి
ఎస్.విజయ్‌చందర్	కూసుమంచి	మధిర
ఎ శ్రీనివాసరావు	ఖమ్మం	మహబూబాబాద్
యూ.నర్సింహారావు	సత్తుపల్లి	కొత్తగూడెం
కొంగర వెంకటేశ్వరరావు	మధిర	ఖమ్మం
కరుణశ్రీ	కొత్తగూడెం	వైరా
పి.వాసవీరాణి	ఇల్లెందు	డీఏఓ ఆఫీస్
కె సత్యనారాయణ (సూపరింటెండెంట్)	ఖమ్మం	వరంగల్
సీనియర్ అసిస్టెంట్లు		
బాలకృష్ణ	ఖమ్మం	వైరా
శివకుమార్	ఖమ్మం(ఎస్‌టీఎల్)	మహబూబాబాద్
శాంత	ఖమ్మం అర్బన్	కూసుమంచి
జి లక్ష్మి	వైరా	డీఏఓ ఆఫీస్
హబీబుద్దీన్	కూసుమంచి	డీఏఓ ఆఫీస్
అశోక్‌బాబు	కొత్తగూడెం	ఖమ్మం (ఎస్‌టీఎల్)

'పెదవాగు' పరిహారం అందేనా?

- సర్వే పేరుతో నెల రోజులుగా కాలయాపన
- నేడు మంత్రి పొంగులేటి పర్యటనతో బాధితుల్లో ఆశలు

అశ్వారావుపేటరూరల్: గత నెల 18వ తేదీన కురిసిన అతి భారీ వర్షంతో అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి సమీపంలోని పెదవాగు ప్రాజెక్టు ఆనకట్టకు భారీ గండ్లు పడగా, వందల ఎకరాల్లో పంటలు ధ్వంసమైన విషయం తెలిసిందే. ఇళ్లలోకి సైతం వరద నీరు రావడంతో ప్రజలకు పెద్ద ఎత్తున ఆస్తి నష్టం సంభవించింది. ఈ విధ్వంసం జరిగి నెల రోజులు దాటినా బాధితులకు ప్రభుత్వం నుంచి చిల్లి గవ్వ కూడా పరిహారం అందలేదు. ఈ క్రమంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మంగళవారం వినాయకపురం, నారాయణపురం గ్రామాల్లో పర్యటిస్తుండగా పరిహారం ప్రకటనపై బాధితులు ఆశలు పెట్టుకున్నారు.

రీ సర్వే చేయాలంటూ..

పెదవాగు వరద ప్రవాహం, ప్రాజెక్టు ఆనకట్టకు గండ్ల కారణంగా మండలంలోని నారాయణపురం, గుమ్మడవల్లి, కొత్తూరు, బచ్చువారిగూడెం గ్రామాల్లో పెద్ద ఎత్తున పంటలు దెబ్బతిన్నాయి. వరి, పత్తి, పామాయిల్‌కు తీరని నష్టం వాటిల్లింది. పొలాల్లో ఇసుక మేటలు, రాళ్ల దిబ్బలు పేరుకుపోయాయి. దీంతో స్థానిక వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో సర్వే చేసి 391 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని నిర్ధారించారు. దెబ్బతిన్న పొలాలకు ఎకరానికి రూ.10వేల చొప్పున పరిహారం ఇస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా ప్రకటించారు. అయితే ఈ సర్వే ప్రామాణికం కాదని, మరోసారి సర్వే చేస్తేనే నష్టం అంచనా తెలుతుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. దీంతో నష్టపోయిన రైతులు మళ్లీ సర్వే చేస్తారనే ఉద్దేశంతో దెబ్బతిన్న పొలాలను అలాగే వదిలేశారు. అయితే నెల రోజులు గడుస్తున్నా రీ సర్వే చేయకపోడంతో ఇక నష్ట పరిహారం ఇప్పట్లో వస్తుందా, రాదా అని రైతులు ఆందోళన చెందుతున్నారు.



పెదవాగు వరదతో పొలంలో వేసిన ఇసుక మేట (ఫైల్)



వరద ఉధృతికి ధ్వంసమైన ఇల్లు (ఫైల్)

ముంపు ఇళ్లకూ అందని పరిహారం..

పెదవాగు, ప్రాజెక్టు కారణంగా ముంపునకు గురై దెబ్బతిన్న ఇళ్లకు సైతం ప్రభుత్వం నుంచి ఎలాంటి పరిహారం అందలేదు. గుమ్మడవల్లి, కొత్తూరు, అనంతారం గ్రామాల్లో 70 ఇళ్లు దెబ్బతిన్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. వరద వచ్చిన మూడు, నాలుగు రోజుల్లోనే బాధితుల జాబితా, బ్యాంకు ఖాతా వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు అందజేశారు. పూర్తిగా కూలిపోయిన ఇళ్లకు రూ.6,200, పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లకు రూ.5,100 చొప్పున పరిహారం అందిస్తామని కొత్తగూడెం ఆర్డీఓ మధు ప్రకటించారు. కానీ నేటికీ ఏ ఒక్కరికీ ఆర్థిక సాయం అందలేదు. కాగా, పంటలు, ఇళ్లు దెబ్బతిన్న రైతులు, బాధితులకు త్వరలోనే పరిహారం అందుతుందని, ఎవరూ ఆందోళన చెందవద్దని అశ్వారావుపేట తహసీల్దార్ కృష్ణప్రసాద్ చెబుతున్నారు.

పారదోలాల్సిన సమయమిదే..

- రోజురోజుకూ పెరుగుతున్న దోమలు
- పరిసరాల పరిశుభ్రతతోనే నిర్మూలన
- వ్యాధుల బారిన పడుతున్న ప్రజలు
- నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదం
- నేడు ప్రపంచ దోమల నివారణ దినోత్సవం


దోమల మందు పిచికారీ చేస్తున్న వైద్యసిబ్బంది (ఫైల్)

భద్రాచలంఅర్బన్: మలేరియా, డెంగీ, చికున్‌గున్యా దోమ వల్ల వ్యాపించే ప్రాణాంతకమైన జ్వరాలు. చిన్న దోమ ఎంత పెద్ద ప్రమాదాన్ని తీసుకొస్తుందో చెప్పడానికి ఈ జ్వరాలే ఉదాహరణ. పట్టణాలతో పాటు గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో దోమల బెడద ఎక్కువగా ఉంది. అయితే, నేడు దోమల నివారణ దినోత్సవం సందర్భంగా కథనం.. ప్రపంచానికి కామన్ శత్రువుగా మారిన దోమల ఆట కట్టించడానికి సర్ రోనాల్డ్ రాస్ శతాబ్దం కిందట రంగంలోకి దిగారు. 1897లో ఆయన దోమల ద్వారానే మలేరియా జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయని నిర్ధారించారు. ఈ పరిశోధనకు గాను ఆయనకు నోబెల్ బహుమతి కూడా వచ్చింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆగస్టు 20వ తేదీని అంతర్జాతీయ దోమల నివారణ దినంగా లండన్ స్కూల్ ఆఫ్ హైజెనిక్ అండ్ ట్రాపికల్ మెడిసిన్ ప్రకటించింది.

అరికట్టేదెలా..

దోమ ఎగురుతున్నపుడు పట్టుకోవడం, చంపడం చాలా కష్టమైన పని. ఒక్క దోమను పట్టుకోవాలంటే ఎంతో శ్రమించాలి. కానీ, దోమలు నీటిలో లార్వా, ప్యూపా దశలో పెరుగుతున్నపుడు నాశనం చేయడం సులువు. ఇవి ఇంటిలో నీటిని నిల్వ చేసే కుండీల్లో చిన్నచిన్న పురుగుల్లా కనిపిస్తుంటాయి. వాటిని చాలా మంది నీటి పురుగులు, జలగలు అని పిలుస్తుంటారు. ఇలా దోమ పిల్లలు (లార్వా) నిల్వ నీటిలో ఉన్నట్లయితే ఆ నీటిని మట్టి లేదా ఇసుకలో పారబోయాలి. ఇలా చేయడం వల్ల లార్వా, ప్యూపా దశల్లో ఉన్న వాటిని వందల సంఖ్యలో నాశనం చేయవచ్చు. దోమలు నిల్వ ఉన్న నీటిలో గుడ్లు పెడతాయి. ఒక దోమ వంద నుంచి 200 వరకు గుడ్లు పెడుతుంది. ఇవన్నీ కేవలం 8 నుంచి 10 రోజుల్లో దోమలుగా మారిపోతాయి. గుడ్డు నుంచి లార్వా, ప్యూపా, అడల్ట్ మస్కిటోగా రూపాంతరం చెందుతాయి.

ఆడదోమలే డేంజర్..

మగ దోమలు చెట్ల రసాలను పీల్చి బతుకుతాయి. ఆడ దోమలు మాత్రం సంతానాభివృద్ధిలో భాగంగా గుడ్లు పెట్టడానికి మనిషి రక్తాన్ని పీల్చుతుంటాయి. ఈ క్రమంలో వ్యాధితో బాధపడుతున్న వ్యక్తిని కుట్టిన దోమ రక్తాన్ని పీల్చినప్పుడు రక్తంతో పాటు వ్యాధి కారకమైన పరాన్నజీవులు దోమ లాలాజల గ్రంధుల్లో చేరతాయి. అక్కడ పరాన్నజీవుల్లో కొన్ని మార్పులు జరుగుతాయి. మరో ఆరోగ్యవంతమైన వ్యక్తిని ఆ దోమ కుట్టినపుడు లాలాజలంతో పాటు పారాసైట్ మనిషి రక్తంలో చేరి వ్యాధులకు కారణమవుతుంది. కాగా, మనిషి రక్తానికి సహజసిద్ధంగా గడ్డకట్టే గుణం ఉంటుంది. దోమ పీల్చినప్పుడు కూడా రక్తం గడ్డ కడితే అది చనిపోతుంది. అందుకు గాను దోమ లాలాజలంలో ప్రత్యేకమైన పదార్థం (హీమోలైసిన్) ఉంటుంది. ఇది రక్తం గడ్డకట్టకుండా చూస్తుంది. దోమ కుట్టడానికి ముందు ఆ పదార్థాన్ని లాలాజలం ద్వారా మనిషిలోకి పంపించి, అనంతరం రక్తాన్నీ పీల్చుతాయి. ఈ లాలాజలం ద్వారానే వ్యాధి కారక పరాన్నజీవులు ఒక మనిషి నుంచి మరో మనిషిలోకి చేరుతాయి. కాగా, ఆడ ఎనాఫిలిస్ దోమ కుట్టడం వల్ల మలేరియా, డెంగీ, చికున్ గున్యా జ్వరాలు, ఈడిస్, క్యూలెక్స్ దోమల వల్ల బోదకాలు వస్తాయి. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు కురిసే వర్షాల కారణంగా రోడ్లపైన ఉండే కొబ్బరిబొండాలు, పాతటైర్లు, రుబ్బురోళ్లలో నిల్వ ఉన్న నీరే వీటి ఆవాస కేంద్రాలు.


అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది (ఫైల్)

తప్పని ఖర్చు..

దోమలు ప్రజారోగ్యాన్ని కాటేస్తున్నాయి. చిన్నా, పెద్దా తేడా లేకుండా దోమలు రక్తాన్ని పీల్చేస్తున్నాయి. దోమల దాడిని తట్టుకునేందుకు ప్రతినెల పచారీ సామగ్రి మాదిరిగానే లిక్విడ్స్, మస్కిటో రీఫిల్స్, కాయిల్స్, మస్కిటో ధూప్‌స్టిక్స్ వంటి వాటికి నెలకు రూ.100 నుంచి రూ.500 వరకు ఒక్కో కుటుంబం ఖర్చు చేస్తోంది. ఇవి కాకుండా దోమల బ్యాట్లు, దోమతెరలు, యాంటీ మస్కిటో మెష్ వంటి వాటికోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించక తప్పడంలేదు. దోమ కాటు వల్ల వచ్చే వ్యాధుల నివారణకు ప్రత్యేకంగా ఖర్చు చేయాల్సిందే.

ఇలా నివారిద్దాం..

దోమలు కుడితే ఎంతటి ప్రాణాంతక విష జ్వరాలు ప్రబలుతాయో అందరికీ తెలిసిందే. దీంతో మస్కిటో రీఫిల్స్, కాయిల్స్ వంటివి మనం దోమల నివారణకు ఇంట్లో వాడతాం. వాటివల్ల కొందరికి శ్వాసకోస వ్యాధులు వస్తాయి. అలా కాకుండా ఈ చర్యలు చేపడితే దోమల నివారణకు మంచిది. వేపనూనె దోమలను తరిమికొట్టడంలో సమర్థవంతంగా పనిచేస్తుంది. దీని వాసన దోమలు భరించలేవు. వేప, కొబ్బరినూనెలను సమాన భాగాలుగా చేసుకుని బయటకు కనిపించే శరీర బాగాలపై రాసుకుంటే దోమలు దరిచేరవు. ఇళ్లల్లోకి దోమలు ప్రవేశించే కిటికీల వంటి ద్వారాల వద్ద తులసి మొక్కలను పెంచాలి. ఇవి దోమలను దూరం చేయడంతో పాటు వృద్ధి కాకుండా చూస్తాయి. లెమన్ ఆయిల్, యూకలిప్టస్ ఆయిల్ మిశ్రమం దోమలను తరిమికొడుతుంది. ఇది సహజసిద్ధమైన యాంటీ సెప్టిక్‌గా కూడా పనిచేస్తుంది. కర్పూరం మెరుగ్గా పనిచేస్తుంది. ఖాళీ ప్రదేశాలను మూసిన తర్వాత కర్పూరాన్ని వెలిగిస్తే దానినుంచి వచ్చే పొగకు దోమలు మాయమవుతాయి.

నివారణకు విస్తృత చర్యలు



దోమల నివారణకు విస్తృతంగా చర్యలు చేపడుతున్నాం. గ్రామాల్లో దోమల మందును పిచికారీ చేయిస్తున్నాం. ప్రతి ఒక్క ఇంట్లో స్ప్రేయింగ్ చేసుకోవాలని సూచిస్తున్నాం. మొదటి, రెండు రౌండ్ల దోమల నివారణ మందు పిచికారీ చేశాం. గ్రామాల్లో దోమతెరల వినియోగంపై గిరిజనులకు చైతన్యం కలిగిస్తున్నాం. మలేరియా, డెంగీ వంటి వ్యాధులు వచ్చిన వెంటనే సంబంధిత పీహెచ్‌సీల్లో పూర్తిస్థాయిలో మందులు అందుబాటులో ఉన్నాయి.

– స్పందన, జిల్లా మలేరియా అధికారి

వ్యాధుల వ్యాప్తి..



దోమలు కుట్టడం వల్ల అనేక వ్యాధులు ప్రబలుతున్నాయి. కొన్ని వ్యాధులు ప్రాణాంతకంగా మారే అవకాశం ఉంది. మలేరియా, టైఫాయిడ్, ఫైలేరియా, డెంగీ వంటి ఎన్నో వ్యాధులకు దోమలే కారణం. రసాయనాలతో కూడిన అనేక రకాల లిక్విడ్లు, కాయిల్స్ వంటివి మార్కెట్లో లభిస్తున్నాయి. వీటిని ఉపయోగించడం వల్ల మరికొన్ని జబ్బులు ప్రబలే ప్రమాదం లేకపోలేదు. ముందుగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దోమల నివారణకు వైద్య శాఖ ద్వారా అనేక చర్యలు చేపడుతున్నాం.

– భాస్కర్‌నాయక్, డీఎంహెచ్‌ఓ

ఎమ్మెల్యేలకు రాఖీ కట్టిన మంత్రి సీతక్క


వైరా ఎమ్మెల్యే రాందాస్‌కు రాఖీ కడుతున్న మంత్రి సీతక్క



కేటీఆర్‌కు రాఖీ కడుతున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియ


పినపాక ఎమ్మెల్యే పాయంకు రాఖీ కడుతున్న మంత్రి సీతక్క

వైరా/మణుగూరుటౌన్/ఇల్లెందు: రాఖీ పౌర్ణమి సందర్భంగా రాష్ట్ర మంత్రి సీతక్క సోమవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యేలకు రాఖీలు కట్టారు. వైరా, పినపాక ఎమ్మెల్యేలు మాలోతు రాందాస్ నాయక్, పాయం వెంకటేశ్వర్లుకు రాఖీలు కట్టిన ఆమె శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ రాఖీ కట్టారు.

రైతుకు రాఖీ కట్టిన ఏఓ

కామేపల్లి: కామేపల్లి వ్యవసాయాధికారిణి తారాదేవి.. సోమవారం విధుల్లో భాగంగా వ్యవసాయ క్షేత్రాలను సందర్శిస్తూనే చేనులో పని చేసుకుంటున్న రైతులను ఆప్యాయంగా పలకరించి రాఖీలు కట్టి ఆశీర్వాదం తీసుకున్నారు. రైతన్నలే దేశానికి వెన్నెముకలని, వారికి రాఖీ కట్టి ఆశీర్వాదం తీసుకోవడం ఆనందంగా ఉందని ఆమె తెలిపారు. కడుతున్న ఏఓ తారాదేవి

అభిమానంతో వైఎస్సార్ విగ్రహానికి రాఖీ

ముదిగొండ: దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి రాఖీ కట్టిన ఓ మహిళ ఆయనపై అభిమానాన్ని చాటుకుంది. ఖమ్మం జిల్లా ముదిగొండలోని తహసీల్ ఎదుట వెంకటాపురానికి చెందిన అలివేలు – రాములు దంపతులు ఇరవై ఏళ్లుగా టీ స్టాల్ నిర్వహిస్తున్నారు. అక్కడ వైఎస్సార్ విగ్రహం ఉండగా ఆయనపై అభిమానంతో అలివేలు సోమవారం రాఖీ కట్టడమే కాక పూలు చల్లి నివాళులర్పించారు. తమ టీ స్టాల్ ఎదుట ఉన్న వైఎస్సార్ విగ్రహాన్ని చూస్తుంటే ఆయన హయాంలో అమలైన సంక్షేమ పథకాలు గుర్తుకొస్తాయని.. అందుకే పండుగ సందర్భంగా రాఖీ కట్టానని అలివేలు తెలిపింది.


వైఎస్సార్ విగ్రహానికి రాఖీ కట్టిన అలివేలు

పెంపుడు కుక్క కూడా సోదరుడే !

ఖమ్మంరూరల్/ ఖమ్మం గాంధీచౌక్: రాఖీ పండుగ సందర్భంగా పలువురు తమ అన్నాతమ్ముళ్లకు రాఖీలు కట్టి అనుబంధాన్ని చాటుకున్నారు. అయితే, ఇళ్లలో కుక్కలను పెంచుకుంటున్న పలువురు వాటికి సైతం రాఖీ కట్టి కుటుంబ సభ్యుల మాదిరి అభిమానాన్ని ప్రదర్శించారు. ఖమ్మం రూరల్ మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్‌కు చెందిన పేర్ల శ్రీను రెండేళ్ల క్రితం చిన్న కుక్క పిల్లను తెచ్చి పెంచుకుంటున్నాడు. దీనికి రాఖీ అని పేరు పెట్టి ఇద్దరు పిల్లలతో సమానంగా పెంచుతుండగా.. ఏ పండుగ వచ్చినా పిల్లలతో పాటే దానికీ ప్రత్యేకంగా బట్టలు కుట్టిస్తాడు. ఇక సోమవారం శ్రీను కుమార్తె తన సోదరుడితో పాటు 'రాఖీకి' రక్షాబంధన్ కట్టడం విశేషం. అలాగే, ఖమ్మం 43వ డివిజన్‌లోని రేవతి సెంటర్‌కు చెందిన ఎల్.హరిహీత తమ ఇంట్లో 'రాబిన్' పేరుతో పెంచుతున్న కుక్కకు రాఖీ కట్టడమే కాక స్వీట్ తినిపించి సోదర సమానంగా భావిస్తానని వెల్లడించింది.


కుక్కకు రాఖీ కడుతున్న పేర్ల శ్రీను కుమార్తె

క్లుప్తంగా

భారీగా గంజాయి స్వాధీనం?

దమ్మపేట: అక్రమంగా తరలిస్తున్న గంజాయిని సోమవారం సీసీఎఫ్ పోలీసులు పట్టుకున్నట్లు తెలిసింది. మండలంలోని మందలపల్లి – అచ్యుతాపురం మార్గంలో గుర్తు తెలియని వాహనంలో గంజాయి రవాణా అవుతున్నట్లు సమాచారం మేరకు జిల్లా సీసీఎఫ్ విభాగం పోలీసులు పట్టుకొని, పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ప్రచారం జరుగుతోంది. పట్టుబడిన గంజాయి సుమారు 497 కేజీల దాకా ఉంటుందని, దీనికి సంబంధించిన వివరాలను మంగళవారం పాల్వంచ డీఎస్పీ వెల్లడిస్తారని సమాచారం.

అక్రమంగా తరలిస్తున్న బియ్యం, ఇప్పపువ్వు పట్టివేత

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు అటవీ మార్గాన అక్రమంగా తరలిస్తున్న బియ్యం, కందిపప్పు, ఇప్పపువ్వును పామేడులో పోలీసులు పట్టుకున్నారు. బీజాపూర్ జిల్లాలోని ఆవుపల్లికి చెందిన శశికళ ట్రేడర్స్‌కు చెందిన లారీలో 50 కిలోల బరువు గల 50 బియ్యం బస్తాలు, 50 కంది పప్పు బస్తాలు, 40 కిలోల బరువు గల 50 ఇప్పపువ్వు బస్తాలను తరలిస్తుండగా పోలీసులు లారీని ఆపారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో లారీతో పాటు బియ్యం, కందిపప్పు, ఇప్పపువ్వును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి డ్రైవర్ కృష్ణను అరెస్టు చేశారు.

రూ.8లక్షలకు ఐపీ దాఖలు

ఖమ్మం లీగల్: ఖమ్మం శుక్రవారపేటకు చెందిన మహ్మద్ హమీద్ అలీ రూ.8,48,378కు గాను దివాలా(ఐపీ) పిటీషన్ దాఖలు చేశాడు. ల్యాబ్‌లకు సంబంధించి సామగ్రి అమ్మకం చేపట్టే ఆయన వ్యాపార నిర్వహణ నిమిత్తం పలువురి వద్ద అధిక వడ్డీకి అప్పులు తీసుకున్నాడు. ఆతర్వాత తీర్చలేని పరిస్థితి ఎదురైందంటూ ఐదుగురిని ప్రతివాదులుగా చేర్చిన అలీ తన న్యాయవాది ద్వారా ఖమ్మం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో సోమవారం ఐపీ దాఖలు చేశాడు.

రోడ్డు పక్కకు దూసుకెళ్లిన స్కూల్ బస్సు

వైరారూరల్: మండలంలోని అష్ణగుర్తిలో గొల్లెనపాడు క్రాస్ సమీపాన వైరాకు చెందిన మధు స్కూల్ బస్సు రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. వైరా నుండి కొణిజర్ల మండలం తూటికుంటకు అష్ణగుర్తి మీదుగా విద్యార్థులను సోమవారం బస్సులో తీసుకెళ్తున్నారు. ఈక్రమంలో గొల్లెనపాడు క్రాస్ సమీపాన అంజనేయ స్వామి ఆలయం వద్ద బైక్‌ను తప్పించే క్రమంలో బస్సు రోడ్డు పక్కకు దూసుకెళ్లి దిగబడింది. దీంతో స్థానికులు ట్రాక్టర్ సాయంతో బయటకు లాగారు. ఆ సమయాన బస్సులో ఇద్దరే విద్యార్థులు ఉండడం, ఎవరికీ ఏం కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,828

ట్రాక్టర్ బోల్తా : ఇద్దరు మృతి


బోల్తా పడిన ట్రాక్టర్


ప్రసాద్, నాగమణి మృతదేహాలు

వీ.కే రామవరం శివారులో అర్ధరాత్రి దాటాక ప్రమాదం

ములకలపల్లి : ట్రాక్టర్ ఇంజన్ బోల్తా పడిన ఘటనలో ఇరువురు మృత్యువాత పడిన ఘటన మండల పరిధిలోని వీ.కే.రామవరం శివారులో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అశ్వాపురం మండలం తుమ్మలచెరువు గ్రామానికి చెందిన తాటి ప్రసాద్, ములకలపల్లి మండలం కమలాపురం గ్రామానికి చెందిన నాగమణి ట్రాక్టర్‌పై వెళుతున్నారు. ఈ క్రమంలో ట్రాక్టర్ ఇంజన్‌కు కల్టివేటర్ తగిలించి ఉండగా, వీ.కే.రామవరం శివారులోని మూలమలుపు వద్ద ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ఈ సమాచారం అందుకున్న ఎస్సై రాజశేఖర్ ఆధ్వర్యంలో సిబ్బంది చేరుకుని ట్రాక్టర్ తొలగించి చూడగా ఇద్దరి మృతదేహాలు బయటపడ్డాయి. అయితే, అర్ధరాత్రి వేళ మృతులు ఇద్దరు ఎక్కడి నుంచి వస్తున్నారనే వివరాలు తెలియాల్సి ఉంది.

విద్యుత్ షాక్‌తో ప్రైవేట్ కార్మికుడికి గాయాలు


ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హనుమాన్

భద్రాచలంఅర్బన్ : విద్యుత్ శాఖలో ప్రైవేట్ కార్మికుడిగా పనిచేస్తున్న హనుమాన్ అనే వ్యక్తి సోమవారం రాత్రి 10 : 30 గంటల సమయంలో లైన్ క్లియరెన్స్ తీసుకోకుండా పట్టణంలోని కూనవరం రోడ్డులో గల ట్రాన్స్‌ఫార్మర్‌పై ఉన్న ఫ్యూజ్ రిపేర్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. బాధితుడు కింద పడిపోగా అక్కడే ఉన్న విద్యుత్ సిబ్బంది స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. హనుమాన్ ఆరోగ్య పరిస్థితిని భద్రాచలం ఏడీఈ వేణు, ఏఈ రాజారావు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. కాగా హనుమాన్ పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం.

వేర్వేరు ఘటనల్లో పలువురి మృతి

వైద్యపరీక్షలకు వెళ్తున్న వృద్ధుడు...

బోనకల్: బోనకల్‌లో సోమవారం ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టిన ఘటనలో నలజాల పుల్లయ్య (67) మృతి చెందాడు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా మాచినేనిపాలెంకు చెందిన పుల్లయ్య ఇటీవల ఖమ్మంలో కంటి ఆపరేషన్ చేయించుకోగా పరీక్షల కోసం సోమవారం ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. బోనకల్‌లో వాహనాన్ని పెట్టి బస్సులో ఖమ్మం వెళ్లాలని భావించిన ఆయన స్థానిక థియేటర్ వద్ద ఆగగా.. వైరా వైపు నుంచి జగ్గయ్యపేట వెళ్తున్న లారీ అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో పుల్లయ్య అక్కడికక్కడే మృతి చెందగా ఆయన వాహనాన్ని లారీ 200 మీటర్ల మేర లాక్కెళ్లింది. దీంతో మంటలు చెలరేగి వాహనం పూర్తిగా కాలిపోయింది. ఘటనా స్థలాన్ని ఎస్సై మధుబాబు పరిశీలించి మృతుడి కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు...


కనకపుడి వంశీ (ఫైల్)

మధిర: మధిరలోని వైరా రోడ్డులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. మండలంలోని సిరిపురానికి చెందిన కనకపుడి వంశీ(23) మధిర నుంచి బైక్‌పై వెళ్లే క్రమాన పెట్రోల్ బంక్ సమీపంలో ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభానికి ఢీకొట్టగా తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను ఆర్కే ఫౌండేషన్ నిర్వాహకులు దోర్నాల రామకృష్ణ అంబులెన్స్‌లో మధిర ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి 108లో ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు మధిర టౌన్ పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడు..

ముదిగొండ: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. నేలకొండపల్లి మండలం గువ్వలగూడెంకు చెందిన మాతంగి అశోక్(25) తన స్నేహితుడైన ముదిగొండ మండలం గోకినేపల్లికి చెందిన పరిపూర్ణాచారితో కలిసి ఆదివారం బైక్‌పై ముదిగొండ నుంచి ఖమ్మం వెళ్తుండగా ముదిగొండ పోలీస్‌స్టేషన్ వద్ద కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అశోక్‌ను ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఘటనపై ఆయన తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడు..

నేలకొండపల్లి: నేలకొండపల్లికి చెందిన బిక్షయ్య (65) గత నెల 8న నడిచి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొనడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయనకు తొలుత ఖమ్మంలో ఆతర్వాత హైదరాబాద్‌లో చికిత్స చేయించగా పరిస్థితి విషమించి ఆదివారం రాత్రి కన్నుమూశాడు. ఘటనపై బిక్షయ్య కుమారుడు నరేష్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

డివైడర్‌ను బైక్ ఢీకొని ఒకరు..

ఖమ్మంరూరల్: మండలంలోని పొన్నేకల్ వద్ద ఖమ్మం – సూర్యాపేట రహదారిపై డివైడర్‌ను ద్విచక్రవాహనం ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కూసుమంచి మండలం జీళ్లచెరువుకు చెందిన కుమ్మరికుంట్ల మహేష్(22), గోపి నాగరాజు, నందిపాటి విజయ్ సోమవారం తెల్లవారుజామున బైక్‌పై ఖమ్మం వెళ్లి తిరిగి వస్తున్నారు. మార్గమధ్యలో కోదాడ క్రాస్ వద్ద కాసేపు ఆగిన అనంతరం వెళ్తుండగా పొన్నేకల్ వద్ద డివైడర్‌ను బలంగా ఢీకొట్టడంతో మహేష్, నాగరాజుకు తీవ్ర గాయాలు, విజయ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని 108లో ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మహేష్ మృతి చెందాడని ఎస్‌ఐ రామారావు తెలిపారు.

బావిలో పడి వ్యక్తి..


పుల్లారావు (ఫైల్)

నేలకొండపల్లి: ప్రమాదవశాత్తు బావిలో పడిన ఓ వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని బైరవునిపల్లికి చెందిన జవ్వెనబోయిన పుల్లారావు (48) సోమవారం తెల్లవారుజామున బావిలో పడి మృతి చెందినట్లు తెలుస్తోంది. టైలర్‌గా జీవనం సాగిస్తున్న ఆయన నాయనమ్మ మాసికం నిర్వహించిన మరుసటి రోజే మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా రోదించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సంతోష్ తెలిపారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

- ప్రారంభానికి నోచుకోని హెల్త్ సబ్ సెంటర్
- ప్రతిపాదనలకే పరిమితమైన రెండో పీహెచ్‌సీ నిర్మాణం
- సమస్యలకు నిలయంగా మంగపేట పీహెచ్‌సీ
- మంత్రి పొంగులేటి చేతుల మీదుగా నేడు నూతన భవనం ప్రారంభోత్సవం


పీహెచ్‌సీ నూతన భవనం

ములకలపల్లి: మండల కేంద్రంలోని మంగపేట గిరిజన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) సమస్యలకు నిలయంగా మారింది. సిబ్బంది కొరత ప్రధానంగా వేధిస్తోంది. ఇక్కడి ఉద్యోగులు బదిలీపై బయటకు వెళుతున్నారే తప్ప తిరిగి ఆ పోస్టులు భర్తీ కావట్లేదు. దీంతో డిప్యూటేషన్‌పై సిబ్బందిని నియమిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. మండల కేంద్రంలో 1986, జూలై 22న నాటి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ కుమెద్‌బెన్ జోషీ చేతుల మీదుగా మంగపేట పీహెచ్‌సీని ప్రారంభించారు. అప్పటి నుంచి పూర్తి ఏజెన్సీ మండలమైన ములకలపల్లి వాసులకు నిరంతరాయంగా సేవలు అందిస్తూనే ఉంది. కాగా భవనం శిథిలావస్థకు చేరడంతో రూ.1.5 కోట్ల వ్యయంతో నూతన భవన నిర్మాణానికి రెండేళ్ల కిందట అప్పటి ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు భూమి పూజ చేశారు. అన్ని హంగులతో భవనం పూర్తి కాగా, రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే జారె ఆదినారాయణతో కలిసి మంగళవారం ప్రారంభించనున్నారు. అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

సిబ్బంది లేక..

పీహెచ్‌సీలో ప్రధాన వైద్య సేవలందించే కీలక పోస్టులు సైతం ఖాళీగానే ఉన్నాయి. ఎన్నో నెలలుగా ఇవి భర్తీకి నోచుకోక పోవడంతో రోగులు అవస్థ పడుతున్నారు. ముఖ్యమైన పోస్టులు ఖాళీగా ఉండటంతో వైద్య సేవలపై ప్రభావం చూపుతోంది. యూడీసీ-1, స్టాఫ్ నర్సు-1, ఎంపీ హెచ్‌ఈఓ-1, ఎంపీ హెచ్ఎస్-1, ఫార్మాసిస్ట్-1, ఫస్ట్ ఏఎన్ఎం-2, నైట్ వాచ్‌మెన్-1, ఎంఎన్ఓ-1, ఎల్‌టీ-1, ఎంఎల్‌హెచ్‌పీ-4 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒక ఇద్దరు స్టాఫ్‌నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్‌లు డిప్యూటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్నారు. ఇక ఫస్ట్ ఏఎన్ఎంలు ఐదుగురు, సెకండ్ ఏఎన్ఎంలు 9 మంది మాత్రమే ఇక్కడి ఉద్యోగులుగా పనిచేస్తున్నారు.

రెండో పీహెచ్‌సీ నిర్మాణమెప్పుడో?

మంగపేట పీహెచ్‌సీ నిర్మించి 38 ఏళ్లు గడుస్తున్నాయి. ప్రస్తుత మండల జనాభా సుమారు 40 వేల వరకు చేరింది. మండలవ్యాప్తంగా పలు గొత్తికోయ గ్రామాలూ ఆవిర్భవించాయి. మండల సరిహద్దు నుంచి ఎటుచూసినా పీహెచ్‌సీకి చేరాలంటే సుమారు 20 కి.మీ ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ఇక్కడ ప్రతీరోజూ సుమారు డెబ్బై మంది రోగులను పరీక్షిస్తూ ఉంటారు. ఈ క్రమంలో జగన్నాథపురంలో మరో పీహెచ్‌సీ ఏర్పాటు అంశం తెరమీదకు వస్తున్నా, అడపాదడపా అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆ అంశాన్ని ప్రస్తావిస్తున్నా కార్యరూపం దాల్చట్లేదు. దీంతో రెండో పీహెచ్‌సీ విషయం ప్రతిపాదనలకే పరిమితమవుతోంది. రోజురోజుకూ ఓపీ పెరుగుతున్నందున మెరుగైన సేవలు అందించాలని పలువురు కోరుతున్నారు.

నిరుపయోగంగా..

ములకలపల్లి హెల్త్ సబ్ సెంటర్ (ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం) నిర్మాణం పూర్తయినా, ప్రారంభానికి నోచుకోవట్లేదు. నేషనల్ హెల్త్ మిషన్ నిధులు రూ.16 లక్షల వ్యయంతో మండల కేంద్రంలోని వైఎస్సార్‌నగర్‌లో దీనిని ఏర్పాటు చేశారు. నిర్మాణం పూర్తయి ఏడాది గడుస్తున్నా, ప్రారంభానికి నోచుకోలేదు. తాగునీటి వసతి, తలుపులు, కిటికీల ఏర్పాటు వంటి అంశాలను సమస్యలుగా చూపుతూ, దీనిని నిరుపయోగంగానే ఉంచుతున్నారు. దీంతో సుందరయ్యనగర్‌లోని అద్దెఇంట్లో హెల్త్ సబ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు.


నిరుపయోగంగా హెల్త్‌సబ్ సెంటర్

క్లుప్తంగా...

ముందు బొట్టు పెట్టాలి కదా!


కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు రాఖీ కడుతున్న ఏపీఎం తదితరులు

తిరుమలాయపాలెం: ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సోమవారం తిరుమలాయపాలెం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గ్రీవెన్స్‌ను పరిశీలించి దరఖాస్తుల స్వీకరణ, పరిష్కారంపై ఉద్యోగులకు సూచనలు చేశారు. రాఖీ పండుగ కావడంతో అక్కడి ఐకేపీ ఏపీఎం అలివేలు మంగ కలెక్టర్‌కు రాఖీ కట్టి హారతి ఇచ్చారు. జిల్లా ఉన్నతాధికారి కావడంతో.. తనలాంటి ఉద్యోగి రాఖీ కట్టడాన్ని ఎలా భావిస్తారోనన్న సంశయంతోనే ఆమె రాఖీ కట్టారు. అయితే, బొట్టు పెట్టకుండా రాఖీ కట్టడాన్ని గమనించిన ఆయన 'ముందు బొట్టు పెట్టాలి కదా..'అంటూ ఆమెకు సంప్రదాయాన్ని గుర్తు చేశారు.

విద్యుత్ సిబ్బంది సాహసం

- వరదలో ఈదుకుంటూ వెళ్లి మరమ్మతులు


వరదలో ఈదుకుంటూ వెళ్తున్న సిబ్బంది

కౌటాల(సిర్పూర్): విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కోసం ఆ శాఖ సిబ్బంది సాహసం చేశారు. వరదలో ఈదుకుంటూ వెళ్లి మరమ్మతులు చేపట్టి శభాశ్ అనిపించుకున్నారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండలం టోంకిని, పారిగాం మధ్య 33 కేవీ విద్యుత్ లైన్‌పై సోమవారం పిడుగుపడటంతో ఇన్సులేటర్ కాలిపోయింది. సిర్పూర్(టి), కౌటాల మండలాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇన్సులేటర్ దెబ్బతిన్న ప్రాంతాన్ని సిర్పూర్(టి) విద్యుత్ సబ్‌స్టేషన్ సిబ్బంది గుర్తించారు. ఇన్సులేటర్ దెబ్బతిన్న స్తంభం చుట్టూ పెద్దవాగు బ్యాక్‌వాటర్ భారీగా చేరింది. సబ్‌స్టేషన్ ఉద్యోగులు ఇద్దరూ బెదరకుండా వరదనీటిలో ఈదుకుంటూ వెళ్లి నూతన ఇన్సులేటర్ అమర్చి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

కుండపోత.. ఉక్కపోత!


సోమవారం హైదరాబాద్ టోలిచౌకిలో ముంచెత్తిన వరద

▶ మొదటి పేజీ తరువాయి
వాతావరణ మార్పులే ఇందుకు కారణమని నిపుణులు చెబుతున్నారు. వాతావరణ మార్పులతోనే ఒక్కసారిగా అతివృష్టి, లేకుంటే తీవ్ర అనావృష్టి పరిస్థితులు నెలకొంటున్నా యని పేర్కొంటున్నారు. ప్రణాళికలు లేని పట్టణీకరణ, పరిమితులు లేని వనరుల వినియోగం, సహజ వనరుల విధ్వంసం వల్ల ఈ పరిస్థితి ఏర్పడుతోందని, జీవన ప్రమాణాలు మరింత దిగజారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎక్స్‌ట్రీమ్ వెదర్ ఈవెంట్స్

ప్రపంచంలోని పర్యావరణ నిపుణులు గొంతెత్తి చెబుతున్న ఒకేఒక్క మాట 'ఎక్స్‌ట్రీమ్ వెదర్ ఈవెంట్స్'. సీజన్‌కు అనుగుణంగా ఉష్ణోగ్రతలు, వర్షాలు నమోదు కావాల్సి ఉండగా.. ఇప్పుడు పర్యావరణంలో నెలకొన్న భారీ మార్పులతో ఎండ, వానలు గతి తప్పాయి. రాష్ట్రంలో గత కొన్నేళ్లుగా ఈ పరిస్థితి నెలకొంది. సీజన్‌లో నమోదు కావాల్సిన సాధారణ ఉష్ణోగ్రత, సాధారణ వర్షపాతం గణాంకాల్లో భారీ వ్యత్యాసం నమోదవుతూ వస్తోంది. ఉదాహరణకు అదిలాబాద్‌లో ప్రస్తుత సీజన్‌లో సాధారణ గరిష్ట ఉష్ణోగ్రత 30.6 డిగ్రీ సెల్సియస్ నమోదు కావాల్సి ఉండగా.. సోమవారం ఏకంగా 34.3 డిగ్రీ సెల్సియస్‌గా నమోదైంది. అదేవిధంగా ఖమ్మంలో ఈ సీజన్ సాధారణ గరిష్ట ఉష్ణోగ్రత 31.5 డిగ్రీ సెల్సియస్ కాగా..సోమవారం 34.6 డిగ్రీ సెల్సియస్‌గా నమోదైంది. రామగుండంలో 31.1 డిగ్రీ సెల్సియస్ సాధారణ గరిష్ట ఉష్ణోగ్రతకు గాను 34.2 డిగ్రీ సెల్సియస్ నమోదైంది. ఈ మూడు ప్రాంతాల్లోనూ సోమవారం నాడు సాధారణ గరిష్ట ఉష్ణోగ్రత కంటే 3 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రత నమోదైంది. ఆగస్టు నెలలో సాధారణ ఉష్ణోగ్రతలు కాస్త తక్కువగా నమోదు కావాల్సి ఉండగా, ఈసారి అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతూ వాటికి తీవ్ర ఉక్కపోత తోడవడంతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. నైరుతి రుతుపవనాల సీజన్‌లో ఇప్పటివరకు రాష్ట్రంలో 49.62 సెంటీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. సోమవారం నాటికి 56.07 సెంటీమీటర్ల వర్షం కురిసింది. రాష్ట్ర సగటును పరిశీలిస్తే సాధారణం కంటే 13 శాతం అధిక వర్షపాతం నమోదైనట్లు కనిపిస్తున్నప్పటికీ.. చాలా జిల్లాల్లో లోటు వర్షపాతమే ఉంది. అంటే కొన్ని జిల్లాల్లో కురిసిన అతి భారీ వర్షాలే గణాంకాలను గణనీయంగా పెంచేశాయన్న మాట. ఉమ్మడి మహబూబ్‌నగర్, వరంగల్ జిల్లాల్లో ఈ అతిభారీ వర్షాలు నమోదయ్యాయి. అంటే కొన్నిచోట్ల అతి తక్కువ వర్షాలు లేదా అసలు వర్షమే లేకపోగా కొన్నిచోట్ల అతిభారీ వర్షాలు నమోదయ్యాయన్న మాట. వాతావరణంలోనూ ఇదే తరహా భిన్నమైన పరిస్థితులు నెలకొంటుండటం గమనార్హం.

పట్టణీకరణ పేరిట వనరుల విధ్వంసం

పట్టణీకరణ పేరిట ఇప్పుడు వనరుల విధ్వంసం విపరీతంగా పెరుగుతోంది. పట్టణీకరణ వల్ల నీటివనరులు పెద్దయెత్తున ఆక్రమణలకు గురవుతుండగా.. చెట్లు, పుట్టలను ఇష్టారాజ్యంగా తెగనరికేస్తున్నారు. మొదట్లో మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైదరాబాద్‌గా ప్రారంభమై ఇప్పుడు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌గా రూపాంతరం చెంది అంతకంతకూ విస్తరిస్తున్నా.. నగరీకరణపై సరైన వ్యూహాత్మక ప్రణాళిక లేకపోవడంతో నష్టం వాటిల్లుతోందని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు వందలాది చెరువులతో కళకళలాడిన హైదరాబాద్, ఇప్పుడు నీటి సమస్యతో సతమతమవుతోందని, చెరువులు కబ్జాల పాలుకావడమే ఇందుకు ప్రధాన కారణమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. నీటి వనరులు కబ్జాలపాలు కావడంతో నీటి ప్రవాహం దెబ్బతిని వరదలు పెరుగుతున్నాయని, చివరకు నిల్వ చేయాల్సిన నీరు సముద్రం పాలుకావడంతో నీటి సమతుల్యత దెబ్బతింటోందని వివరిస్తున్నారు. అదేవిధంగా ఓపెన్ స్పేస్ నిబంధనలు గాలికొదిలి అనేక అంతస్తులతో భారీ నిర్మాణాలు చేపట్టడం, విచ్చలవిడి లేఅవుట్‌లతో పచ్చదనం పూర్తిగా తగ్గిపోతోందని అంటున్నారు. దేశంలో అత్యంత తక్కువ ఓపెన్ స్పేస్ ఏరియా ఉన్న నగరంగా హైదరాబాద్ రికార్డుల్లోకి ఎక్కడాన్ని గుర్తు చేస్తున్నారు.

పెరగని సాగు విస్తీర్ణం

సకాలంలో వర్షాలు కురవకపోవడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పలుచోట్ల ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరగడం, ఉక్కపోతతో కూడిన విభిన్న వాతావరణం నెలకొనడం పంటల సాగుపైనా ప్రభావం చూపించింది. వానాకాలం సీజన్ చివరి దశకు చేరుకున్నా రాష్ట్రంలో సాగు విస్తీర్ణం పెరగలేదు. ఈ సీజన్‌లో పంటల సాధారణ సాగు విస్తీర్ణం 1.29 కోట్ల ఎకరాలు కాగా.. ఈ నెల 14వ తేదీ వరకు 1.03 కోట్ల ఎకరాల విస్తీర్ణంలో పంటలు వేయాల్సి ఉంది. కానీ 94 లక్షల ఎకరాల మేర మాత్రమే పంటలు సాగవడం గమనార్హం.

నీటి వనరుల విషయంలో కఠినంగా వ్యవహరించాలి

హైదరాబాద్ లాంటి నగరానికి అతి త్వరలో తీవ్ర నీటి సమస్య ఎదురు కానుంది. ఒకప్పుడు వేలల్లో ఉన్న చెరువులు ఇప్పుడు వందల్లోకి పడిపోయాయి. నీటి నిల్వలకు కేంద్రంగా ఉండే చెరువుల సంఖ్య తగ్గిపోతుండగా కాలువలన్నీ కబ్జాలపాలవుతున్నాయి. ఉదాహరణకు ఫిరంగి రనాలా అనే కాలువతో శివారు ప్రాంతాల్లోని 22 చెరువులు నీటితో నిండేవి. కానీ ఈ నాలా కబ్జాకు గురైంది. దీనిపై పెద్ద ఎత్తున ఉద్యమాలు జరిగాయి. కానీ ఫలితం లేదు. ఆ నాలాను పునరుద్ధరిస్తే దాని కింద ఉన్న గొలుసుకట్టు చెరువులు నీటితో కళకళలాడుతాయి. అదేవిధంగా నగరంలో ఉన్న చెరువులు, ప్రధాన కాలువలను పునరుద్ధరించి పరిరక్షిస్తే నీటి సమస్యకు కొంతైనా పరిష్కారం లభిస్తుంది.

– ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి,
పర్యావరణ శాస్త్రవేత్త

సమగ్ర ప్రణాళికతోనే సాధ్యం...

నగరీకరణలో అత్యంత కీలకం సమగ్ర ప్రణాళిక. కానీ ఇప్పుడు కేవలం కట్టడాలతోనే అభివృద్ధి జరుగుతుందనే ఆలోచన ఉంది. అడ్డగోలు కట్టడాలతో కాంక్రీట్ జంగిల్‌గా మారడం తప్ప మెరుగైన జీవావరణం ఏవిధంగా సాధ్యమవుతుంది. అందుకే పక్కా ప్రణాళికను రూపొందించి అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఇప్పుడు హైదరాబాద్‌లో అక్రమ నిర్మాణాల తొలగింపు ప్రక్రియ గత కొన్ని రోజులుగా కనిపిస్తోంది. ప్రభుత్వం ఇదే చిత్తశుద్ధితో పూర్తిస్థాయిలో కట్టడాల తొలగింపుతో పాటు ప్రణాళికబద్ధంగా అభివృద్ధి కార్యక్రమాలను వ్యూహాత్మకంగా అమలు చేయాలి.

– సుబ్బారావు,
పర్యావరణ నిపుణులు

2023, 2024ల్లో ఆగస్టు 12 నుంచి 17 వరకు నమోదైన విద్యుత్ వినియోగం వివరాలు..

2024	మి.యూనిట్లు	2023	మి.యూనిట్లు
ఆగస్టు 17న	270.808	ఆగస్టు 17న	268.638
ఆగస్టు 16న	288.52	ఆగస్టు 16న	265.179
ఆగస్టు 15న	287.486	ఆగస్టు 15న	255.56
ఆగస్టు 14న	294.414	ఆగస్టు 14న	271.844
ఆగస్టు 13న	290.542	ఆగస్టు 13న	274.411
ఆగస్టు 12న	281.217	ఆగస్టు 12న	267.151

బస్సులో ఒకరు.. ఆటోలో మరొకరు ప్రసవం

వనపర్తి, భద్రాచలంలో ఘటనలు.. తల్లీబిడ్డలు క్షేమం


పాపను చూపిస్తున్న కండక్టర్ భారతి, చిత్రంలో తల్లి సంధ్య


మనవడిని లాలిస్తున్న అమ్మమ్మ

వనపర్తి / భద్రాచలంఅర్బన్ : బస్సులో ప్రయాణం చేస్తుండగా ఓ గర్భిణికి, ప్రసవానికి ఆస్పత్రికి తీసుకొస్తుండగా మరొకరికి పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో బస్సు, ఆటోలోనే ఇద్దరికీ ప్రసవం చేశారు. బస్సులో స్టాఫ్‌నర్సు, ఆటోలో డాక్టర్లు పురుడు పోసి మానవత్వం చాటుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. సోదరులకు రాఖీ కట్టేందుకు జోగుళాంబ గద్వాల జిల్లా కొండుపల్లి గ్రామానికి చెందిన గర్భిణి సంధ్య భర్త రామంజితో కలిసి ఆర్టీసీ బస్సు ఎక్కింది. బస్సు వనపర్తి మండలం నాచహళ్లి గ్రామ శివారులోకి రాగానే, సంధ్య పురిటి నొప్పులు తట్టుకోలేనంటూ కండక్టర్ భారతికి చెప్పింది. దీంతో 108కు సమాచారం అందించి.. వెంటనే బస్సులోని ప్రయాణికులను కిందకు దింపారు. అదే బస్సులో ప్రయాణిస్తున్న స్టాఫ్‌నర్సు అలివేలు సాయంతో సాధారణ ప్రసవం చేయగా, ఆడశిశువు జన్మించింది. అనంతరం తల్లీబిడ్డను 108లో వనపర్తి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆర్టీసీ బస్సులో పురుడు పోసుకున్న మహిళ విషయం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ విషయం తెలుసుకున్న ఆ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. సమయస్ఫూర్తి, మానవత్వం చాటిన మహిళా కండక్టర్ భారతిని ప్రశంసించారు. కండక్టర్, స్టాఫ్‌నర్సును మంగళవారం హైదరాబాద్‌లోని ఆర్టీసీభవన్‌కు రావాలని సూచించారు.ఈ ఘటనపై కండక్టర్ భారతి మాట్లాడుతూ జీవితంలో ఈ ఘటన గుర్తుండిపోతుందని చెప్పారు. స్టాఫ్‌నర్సు అలివేలు మాట్లాడుతూ సంధ్యది మాది ఒకే ఊరు అని, కాన్పు చేసేందుకు గ్లౌసులు లేకపోయినా వెనుకాడలేదన్నారు. పాప తల, మెడకు పేగు చుట్టుకొని ఉంది. దాన్ని జాగ్రత్తగా తీసి సుఖ ప్రసవం చేశామని చెప్పారు.

భద్రాచలంలో....
భద్రాచలం పట్టణంలోని రాజుపేటకు చెందిన సాయినిఖితకు సోమవారం వేకువజామున పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. దీంతో కుటుంబసభ్యులు రాజుపేట నుంచి ఆటోలో భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకురాగా, ఆస్పత్రి ప్రాంగణంలోనికి రాగానే నొప్పులు ఎక్కువ కావడంతో భర్త హరీశ్ మాతాశిశు విభాగం సిబ్బందికి చెప్పాడు. వెంటనే నర్సులు కృష్ణవేణి, నాగలక్ష్మి వచ్చి పరీక్షించగా, అప్పటికే శిశువు గర్భం నుంచి కిందకు జారి పేగులు మెడలో వేసుకొని బయటకు రావడాన్ని గమనించారు. వెంటనే ప్రసవం చేయగా, సాయినిఖిత మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డను చికిత్స నిమిత్తం ప్రసవ వార్డుకు తరలించారు. ఇద్దరూ క్షేమంగా ఉన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవించిన న్యాయమూర్తి


బిడ్డతో జూనియర్ సివిల్ జడ్జి స్వప్న

సింగరేణి (కొత్తగూడెం): నల్లగొండ జిల్లా మున్సిఫ్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి టి.స్వప్న ఆదివారం రాత్రి కొత్తగూడెం ప్రభ ుత్వ ఆస్పత్రిలో ప్రసవించారు. కొత్తగూడెంలోని బూడిదగడ్డ బస్తీకి చెందిన న్యాయవాది శాంత కుమార్తె అయిన స్వప్నకు మిర్యాలగూడ మండలం నిడమనూరుకు చెందిన దాసరి కార్తీక్‌తో వివాహం జరిగింది. ప్రస్తుతం నల్లగొండ జిల్లా మున్సిఫ్ కోర్టులో జూనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్న స్వప్న.. ప్రసవం కోసం కొత్తగూడెంలోని పుట్టింటికి వచ్చారు. ఉన్నత విద్యనభ్యసించి, న్యాయమూర్తిగా కొనసాగుతున్న ఆమె.. కార్పొరేట్ స్థాయి వైద్యం చేయించుకునే స్థోమత ఉన్నా సామాన్య ప్రజలకు నమ్మకం కలిగేలా ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవించాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో కొత్తగూడెంలోని మాతాశిశు సంరక్షణ కేంద్రంలో చేరగా ఆదివారం రాత్రి ఆడబిడ్డకు జన్మనిచ్చారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచిత వైద్య సేవలు ఉపయోగించుకోవాలని, పూర్తి నమ్మకంతో వైద్యం పొందాలని సూచించారు. తనకు వైద్యసేవలందించిన డాక్టర్ సాగరిక, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా వార్తలు

ఘనంగా హయగ్రీవ జయంతి

నేటి నుంచి నిత్యకల్యాణాలు పునఃప్రారంభం


చిన్నారులకు పలకలు అందజేస్తున్న స్థానాచార్యులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో జరుగుతున్న పవిత్రోత్సవాలు సోమవారంతో ముగిశాయి. అలాగే, సోమవారం ఆలయంలో హయగ్రీవ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని హయగ్రీవుడి ఉపాలయంలో పండితులు వేదమంత్రాలు, భక్తజనం శ్రీరామ నామ స్మరణల నడుమ ప్రత్యేక స్నపనం, తిరుమంజనం జరిపించారు. ఆ తర్వాత చిన్నారుల విద్యాప్రాప్తి కోసం ఆలయం తరఫున పలకలను స్థానాచార్యులు స్థలశాయి అందజేశారు. పవిత్రోత్సవాల ముగింపు సందర్భంగా యాగశాలలో మహాపూర్ణాహుతి, కుంభప్రోక్షణ, పవిత్రావరోపణం నిర్వహించారు. కాగా, పవిత్రోత్సవాలను పురస్కరించుకుని నిలిపివేసిన నిత్యకల్యాణాన్ని మంగళవారం పునఃప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే, బుధవారం మధ్యాహ్నం రామకోటి పుస్తకాలను గోదావరిలో నిమజ్జనం చేయనున్నందున భక్తులు పాల్గొనాలని కోరారు.

ప్రగడవరం అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ


పూజలు చేస్తున్న ఎంపీ దంపతులు

ఖమ్మంమయూరిసెంటర్: రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, విజయలక్ష్మి దంపతులు సోమవారం ఏపీలోని ఏలూరు జిల్లా ప్రగడవరంలో శ్రీశ్రీశ్రీ రామలింగేశ్వర సమేత విజయ శంకర బాల కనకదుర్గాదేవి శివపంచాయతన క్షేత్రాన్ని సందర్శించారు. అక్కడ ప్రత్యేక పూజలు చేసిన ఎంపీ దంపతులు ఆ తర్వాత శివ పార్వతుల కల్యాణంలో పాల్గొని పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు.

ఆ మృత శిశువు ఎవరో?


ఈనెల 13న గోదావరి ఒడ్డున లభించిన మృతశిశువును తీసుకొస్తున్న స్థానికులు (ఫైల్)

యువతి వీడియోతో మళ్లీ తెరపైకి అంశం..
- నమ్మించి అబార్షన్ చేయించాడని యువకుడు, ఆస్పత్రిపై ఆరోపణ
- ఆరోపణలను ఖండించిన ప్రైవేట్ ఆసుపత్రి నిర్వాహకులు

భద్రాచలంఅర్బన్: ఇటీవల భద్రాచలంలో గోదావరి ఒడ్డున దొరికిన మృత శిశువు మిస్టరీ వీడలేదు. మృతశిశువు లభించి వారం కావొస్తుండగా బాధ్యులెవరో పోలీసులు గుర్తించలేదు. ఇంతలోనే ఓ యువతి మాట్లాడిన వీడియో సోమవారం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మృత శిశువు అంశంపై తెరపైకి వచ్చింది. కాగా, భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి నిర్వాహకులపై ఆరోపణలు వెల్లువెత్తుతుండగా, వారు మాత్రం తమ తప్పేం లేదని వెల్లడించారు.

పోలీసులు విచారిస్తేనే...
పోలీసులు మృత శిశువు ఘటనపై పూర్తిస్థాయిలో విచారిస్తేనే అసలు విషయం బయటపడే అవకాశముంది. కానీ బ్రిడ్జి కింద మృత శిశువు దొరికి వారం దాటినా నిందితులను గుర్తించకపోవడం.. యువతి విడుదల చేసిన వీడియోతో విచారణ జరుగుతుందని పోలీసులు చెప్పడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భద్రాచలంలో దాతల సహకారంతో రూ.లక్షలు వెచ్చించి సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. నిత్యం రద్దీగా ఉండే బ్రిడ్జి, కరకట్ట సమీపాన మృతశిశువును వదిలేసి వెళ్తే ఎవరు బాధ్యులో తేల్చకపోవడాన్ని స్థానికులు తప్పుపడుతున్నారు. కేవలం ప్రైవేట్ ఆస్పత్రుల్లో రికార్డులు, సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలించి వదిలేశారని చెబుతున్నారు. పోలీసులు ఇకనైనా పూర్తిస్థాయిలో విచారిస్తే యువతి చెబుతున్న మృత శిశువు, బ్రిడ్జి క్రింద దొరికిన శిశువు ఒకరేనా.. కాదా అన్నది తేలనుంది. ఈమేరకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కాగా, ఈ ఘటనపై విచారణ చేస్తున్నామని, పూర్తయ్యాక అన్ని వివరాలు వెల్లడిస్తామని భద్రాచటం పట్టణ సీఐ వై.సంజీవరావు తెలిపారు.

మత్తు మాత్రలు ఇచ్చి అబార్షన్...
ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరుకు చెందిన ఓ యువతి మాట్లాడిన వీడియో సోమవారం వైరల్‌గా మారింది. అదే మండలానికి చెందిన కారం సిద్ధు, తాను రెండేళ్లుగా ప్రేమించుకుంటుండగా పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేశాడని పేర్కొంది. కుటుంబ సభ్యులు అంగీకరించేసరికి సమయం పడుతుందంటూ ఏడు నెలల గర్భాన్ని తొలగించేలా తనకు తెలియకుండా ఈనెల 10న మాత్రలు ఇచ్చాడని, అవి మింగగానే స్పృహ కోల్పోవడంతో యువకుడు, ఆయన అక్క భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారని తెలిపింది. అక్కడ అబార్షన్ చేసి బిడ్డను బయటకు తీయగా, తన బిడ్డ మృతి చెంది ఉంటాడని ఆరోపించింది. అయితే, మృత శిశువు బ్రిడ్జి వద్ద దొరికిందనే సమాచారం తెలియడంతో కారణమైన సిద్ధు, ఆయన కుటుంబంపై చర్యలు తీసుకోవాలని కోరింది. అయితే, ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యం మాత్రం ఓ యువతిని తీసుకొచ్చిన వ్యక్తులు ఆమె భర్త, కుటుంబీకులు చెప్పి కడుపు నొప్పితో బాధపడుతోందని తెలపగా స్కానింగ్ తీసేసరికే అబార్షన్ జరిగినట్లు తేలిందన్నారు. దీంతో యువతి ప్రాణాలను కాపాడేందుకు యువతి, ఆమె భర్తగా చెప్పిన వ్యక్తి ఆమోదంతో ఇతర ప్రక్రియ పూర్తి చేసి నిబంధనల మేరకు మృత శిశువును అప్పగించామని వెల్లడించారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్లు


మావోయిస్టులకు వ్యతిరేకంగా వేసిన పోస్టర్లు

దుమ్ముగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలంలోని పెద్దనల్లబల్లి, సీతానగరం గ్రామాల్లో మావోయిస్టులకు వ్యతిరేకంగా ఆదివాసీ యువజన సంఘం, మహిళా విభాగం పేరిట సోమవారం వాల్‌పోస్టర్లు వెలిశాయి. 'మావోయిస్టులు అమర్చే మందుపాతరలతో అమాయక ఆదివాసీలు మృత్యువాత పడుతున్నారు.. ఆదివాసీల మనగడకు ముప్పు తలపెడుతున్న మావోయిస్టులను తరిమికొడదాం'అంటూ ఆ పోస్టర్లలో పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు అమర్చిన ఐఈడీ పేలి సుక్మా జిల్లా దబ్బమార్కలో ఆదివాసీ మహిళ కవ్వాసి సుక్కి మృతి చెందిందని ఫొటోలు ముద్రించారు. అంతేకాక మావోయిస్టు పార్టీలో అక్రమ వసూళ్లు కొనసాగుతున్నాయని, మావోయిస్టు బడా నేతలు ఈ దందాలో ఉన్నారని చెబుతూ వారికి సహకరించొద్దని పోస్టర్లలో పిలుపునిచ్చారు.

నేటి నుంచి ఆందోళనలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో మంగళవారం నుంచి 28వ తేదీ వరకు ఆందోళనలు చేపట్టనున్నట్లు సీఐటీయూ నాయకులు తెలిపారు. ఈనెల 24వరకు సంతకాల సేకరణ, 26న గనుల వద్ద అధికారులకు వినతిపత్రాలు ఇవ్వడమే కాక 28న జీఎం కార్యాలయాల ఎదుట ధర్నా చేస్తామని వెల్లడించారు. తెలంగాణలోని అన్ని గనులను సింగరేణికే కేటాయించాలని, యాజమాన్యం నికర లాభాలు ప్రకటించి కార్మికులకు 35 శాతం వాటా చెల్లించాలని, 2022–23లో సీఎంపీఎఫ్ ఎక్కువగా తీసుకున్న నగదు తిరిగి ఇవ్వడమే కాక 190మస్టర్లు పూర్తిచేసిన బదిలీ వర్కర్లకు జనరల్ మజ్దూర్లుగా పదోన్నతి కల్పించాలనే డిమాండ్లతో ఆందోళన చేపడుతున్నట్లు నాయకులు తెలిపారు.

పాలవాగు ఉధృతితో నిలిచిన రాకపోకలు


ఉధృతంగా ప్రవహిస్తున్న పాలవాగు


వాగు ఒడ్డున నిరీక్షిస్తున్న స్థానికులు

ములకలపల్లి: మండలంలోని ముత్యాలంపాడు శివారు పాలవాగు ఉధృతరూపం దాల్చింది. వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మిస్తుండగా లోలెవల్ చప్టాను తొలగించి డైవర్షన్ రోడ్డు వేశారు. అయితే, పదిరోజుల కిందట భారీ వర్షాలతో డైవర్షన్ రోడ్డుపై వరద ఉధృతి పెరగగా రాకపోకలు నిలిచిపోయాయి. ఇప్పుడు సోమవారం కూడా వర్షం కురవడంతో డైవర్షన్ రోడ్డు పైనుంచి వరద ప్రవహించి రవాణాకు అంతరాయం ఏర్పడింది. స్థానికులు పొద్దుపోయే వరకు వాగు ఒడ్డునే నిరీక్షించి.. ప్రవాహం నెమ్మదించాక ఇళ్లకు బయలుదేరారు.

పెద్దమ్మతల్లి గుడిలో 21న వేలం పాటలు

పాల్వంచరూరల్: మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయం కాంప్లెక్స్‌ల్లోని గదులు అప్పగించడంతో పాటు ఇతర పనులకు గాను ఈ నెల 21న వేలం నిర్వహించనున్నట్లు ఈఓ ఎస్.రజనీకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన కాంప్లెక్స్‌లోని 1, 2, 11 నంబర్ షాపులను మూడేళ్ల పాటు, పాత క్లాంపెక్స్‌లోని 3, 4వ నంబర్ గదులను 11 నెలల కాల పరిమితితో లీజ్‌కు ఇస్తామని పేర్కొన్నారు. అలాగే, పూలదండల విక్రయం, తలనీలాల అమ్మకం, చీరలు పోగు చేసుకునే హక్కు కల్పించడంతో పాటు దసరా సందర్భంగా వివిధ వస్తువుల సరఫరాకు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు బుధవారం ఉదయం 10.30 గంటల వరకు రూ.200 చెల్లించి దరఖాస్తు తీసుకుని నిర్దేశిత ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని వెల్లడించారు.

కిన్నెరసాని ప్రాజెక్టుకు వరద


గేట్లు ఎత్తడంతో దిగువకు వెళ్తున్న వరద

రెండు గేట్లు ఎత్తి 10వేల క్యూసెక్కులు విడుదల

పాల్వంచరూరల్: ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షానికి పాల్వంచ మండలంలోని కిన్నెరసాని రిజర్వాయర్‌కు వరద వచ్చి చేరుతోంది. 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్‌లోకి ఎగువ నుంచి 7,500 క్యూసెక్కుల మేర వరద రావడంతో సోమవారం నీటిమట్టం 405.40అడుగులకు చేరింది. దీంతో రెండు గేట్లు ఎత్తి 10వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. ఈమేరకు రాజాపురం, యానంబైల్ గ్రామాల మధ్య లో లెవల్ చప్టాపైకి వరద చేరి పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.